# పసిరిక

"ఇంకా ఎంతమంది ఉన్నారు?" అని అడిగింది పింకీ మోహన్‌సింగ్.

'ఒక్క నిముషం మేడం.....' ఆపరేటర్ మైక్రో కాంప్ స్విచ్ నొక్కాడు. అతడి మేజామీదున్న గాజు పలక మీద ఒక మూల చలనచిత్రం కనపడసాగింది... చాలా పెద్ద క్యూ ఉంది. ఆడామగా పిల్లలూ కలిసి రెండొందల మందిదాకా ఉండవచ్చు....ఎస్కా మూవర్ మీద ఆసీనులయి ఉన్నారు. అది నెమ్మదిగా సాగుతూంది. ఆ మాటే చెప్పాడతను క్యూరేటర్ పింకీ సింగ్‌తో. "అంటే ఇంకో గంటయినా పడుతుంది...." అంటూ ఆమె వరండా నుండి ముందువైపున్న తన ఆఫీసు గదిలోకి నడిచింది. నడుస్తూ నడుస్తూ ఒక్క క్షణం ఆగి ఆ కింద, వెనుకవైపు ఆకుపచ్చ తివాసీలా ఉన్న మైదానం కేసి చూసింది.

అందుల్లో రంగు రంగుల పూల మొక్కలతో ఆ ఉద్యానవనం ఒక పెద్ద సీతాకోకచిలుకలా అద్భుతంగా ఉంది. 'యాభై ఏళ్ళ కిందా ఇలాగే ఉండేదేమో' అనుకుంది పింకీ.

యాభైఏళ్ళ కింద ఈ తివాసీ మీద పచార్లు చేస్తుండేవాడు జవహర్లాల్ నెహ్రూ... అనుకుంటునే ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది....1964 లో ఆయన కన్నుమూసేనాటికి తానింకా ఈ భూమ్మీది కళ్ళు తెరవలేదు. ...ఆయన అమరుడైనప్పటి నుండి ఆరకుండా వెలుగుతూంది. ...అదిగో ఆ అమరజ్యోతి.... ఆ మహానుభావుడు ఉండిన ఈ తీన్‌మూర్తీ భవన్ ఇప్పుడు ప్రపంచంలోని గొప్ప యాత్రా స్థలాల్లో ఒకటయింది. మామూలుగానే రోజుకు వేయి మందికి తగ్గకుండా వస్తుంటారు. గత సంవత్సర అమెరికన్ అధ్యక్షుడు మైక్‌నాట్లీ భారతదేశం వచ్చినప్పుడు – జవహర్లాల్ స్మృతికి అంజలి ఘటిస్తూ – " ఏడు రంగులు కలిసి సూర్యకిరణం అయినట్లుగా త్యాగం, దేశభక్తి, ఆధునికత, మానవత, శాంతి కాముకత, దూరదృష్టి, కార్యదీక్ష అన్న సప్తవర్ణాల సంయోగమే – జవహర్లాల్" అంటూ ఒక అపురూపమైన పాత్రను ఈ నెహ్రూ మ్యూజియంకు బహూకరించారు.

అది అక్షరాలా అపురూపమైనదే! ఆ పాత్ర ఒక అమెరికన్ పురావస్తు త్రవ్వక బృందానికి ఈజిప్టులో దొరికింది. అద్భుతమైన శిల్పవిన్యాసంతో అలరారే ఆ ఒకటిన్నర అడుగుల ఎత్తు, రెండడుగుల వ్యాసం గల ఆ పాత్ర దేనితో తయారయినది అని ఈ 2005 సంవత్సరపు నాటి టెక్నాలజీ కూడా చెప్పలేకపోతుంది. ఆ పాత్ర ఒక్కసారి ఒక్కొక్క రంగులో కన్పిస్తుంది. నీలంగా గంటసేపు అకర్షించిన ఆ పాత్ర హఠాత్తుగా వూదా రంగులోకి మారుతుంది. ఉన్నట్లుండి ఎరుపు ఆకుపచ్చనవుతుంది. ఆ మార్పులు చూస్తుంటే వేకువజామున ఆకాసం వాకిట రంగుల కుంచెలు ఆడుకోవడం గుర్తుకొస్తుంది.

అదుగో అతి భద్రంగా ఆ కింద లాన్‌లో గాజు పెట్టెలో ఉంచిన ఆ ఏడురంగుల పాత్రను చూడడానికి వచ్చే జనం ఇంతా అంతా కాదు. అందులోనూ నవంబర్ 14వ తేదీ అయితే మూడు నాలుగు మైళ్ళ క్యూ ఉంటుంది. వాళ్ళందరూ కూర్చున్న ఎస్కామూవర్ నెమ్మదిగా కదులుతూంది.

.....రెండు వందల మంది అంటే ఇంకో గంట.... అంటే రెండున్నర దాటిపోయింది. ...ఇంక లంచ్‌కి ఇంటికేమి వెళతాంలే. అనుకున్న పింకీసింగ్ తన చేతి గడియారానికి ఉన్న బటన్లలో ఒకటి నొక్కింది. గడియారం మీద అంకెలు మానేసి అది దూరదర్శన్ రిసీవర్‌గా మారింది. 'బీన్ బీన్.....బాం, బీన్ బీన్ బాం' అని సిగ్నల్ ఇవ్వసాగింది.

"ఏమమ్మా పింకీ, ఎందుకు పిలిచావు" అంటూ ఆ గడియారపు తెర మీద కొచ్చిన పింకీ వాళ్ళమ్మ అడిగింది.

"నేనింటికి భోజనానికి రావడం లేదు" అని వివరించి స్విచ్ ఆఫ్ చేసింది పింకీ.

రెండు న్యూట్రివిచ్‌లను తెప్పించుకుని తిని బ్లాక్ కాఫీ తాగింది పింకీ. రెండు రోజుల నుండీ పాల పైప్‌లైన్లు మరమత్తులలో ఉండడంతో – పాల మాత్రలు వాడుతున్నారు. ఢిల్లీ నగరవాసులు, పాలు లేకపోయినా ఫరవాలేదనుకునే రకం వ్యక్తి పింకీ.

మళ్ళీ మధ్యాహ్నం మూడింటికి యాత్రికుల ప్రవాహం మొదలయింది. సిబ్బందికి తగు హెచ్చరికలు చేసి పింకీ 'కీ– కేంద్రం' అనబడే గదిలోకి వెళ్ళింది.

అక్కడ గది మధ్యలో ఉన్న కుర్చీలో కూర్చుంది. కుర్చీ చేతికి ఉన్న ఒక స్విచ్ నొక్కగానే ఆమె తల మీద ఉన్న పెద్ద వర్తులాకారపు వయొలెట్ రంగు దీపం వెలిగింది. క్రమంగా ఆ దీపపు కాంతి ప్రకాశవంతమైంది. అది పూర్తి ప్రకాశాన్ని చేరుకునేసరికి ఆమె ఎదుటి గోడమీద నాలుగు అడుగుల వెడల్పు, రెండడుగుల ఎత్తున వెలుగు ఫోకస్ అయింది.

పింకీ తన వాచీ చూసుకుంది. మూడూ తొంభైతొమ్మిది అయింది. (అవును 1996 నుండి ప్రపంచమంతటా కాలమానం దశాంశాల్లోకి మారింది. అప్పటినుండీ గంటకు వంద నిమిషాలు, రోజుకు పది గంటలు.)

నాలుగు అవగానే ఆ ఫోకస్‌లోకి ఇంకో ముగ్గురు వచ్చారు.

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ దేశభక్తుడూ, బెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన రామచంద్రయ్య తొంభైఏళ్ళవాడు. అయినా నల్లటి నిగనిగలాడే ఒత్తయిన జుత్తుతో దృఢంగా ఉన్నాడు.

పాట్నా నుంచి వచ్చే సుప్రసిద్ధ దిన పత్రిక 'నవవాణీ' సంపాదకుడు దివ్యేంద్రసింహో, అహ్మదాబాద్‌లోని స్పేస్ సెంటర్ డైరక్టర్ జనరల్ జనక్ పటేల్‌లు కనబడ్డారు. వారితోబాటు పింకీ కూడా కనపడింది.

నవ్వుతున్న వారి నలుగురి మొహాలు చిన్నవిగా అయి నాలుగు మూలలకు జరిగాయి. మధ్యనున్న ఖాళీ స్థలంలోకి అనౌన్సరు మొహం వచ్చింది.

"గుడీవినింగ్ ఫ్రెండ్స్...... ఈ సాయంకాలం జరగనున్న–'21వ శతాబ్దానికి జవహర్లాల్ నెహ్రూ పెట్టిన భిక్ష' అన్న అంశం మీద చర్చలో మీరు పాల్గొంటున్నారు" అంటూ పాల్గొంటున్నవారిని ప్రేక్షకులకు పరిచయం చేసింది.

కార్యక్రమం మొదలయింది. ఎవరి వూరిలోనే వారున్నా ఆ నలుగురూ కలిసి ఎదురెదురుగా కూర్చున్నట్లు సాగిన ఆ గోష్ఠి – జవహర్లాల్ జన్మదిన సందర్భంగా ఇండియన్ స్పేస్ – మిషన్ కేంద్రంవారి సమర్పణ. ఆ వక్తలతోబాటు ప్రేక్షకులు కూడా పాల్గొన్న ఆ రసవత్తరమైన గోష్ఠి అరింటికి ముగిసింది.

యాత్రికుల సమయం అయిదున్నరతో అయిపోయింది. భద్రతా సిబ్బంది, ఇంకో ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. పింకీ ఒకసారి భవనం అంతా తిరిగి చూచి, భద్రతా సిబ్బందిని ప్రత్యేకంగా హెచ్చరించి భవనం వెలుపలకు వచ్చింది.

తన 'ఫ్లై–బైల్' లో కూచుంది. వేగం, దూరం, గమ్యం అన్నీ ఇంజనుకు డిక్టేట్ చేసింది. వెంటనే ఆ శకటం పైకి లేచింది. ఆమె అటు తిరిగి అద్దంలో మొహం చూచుకుని, జుత్తు సరి చేసుకుంది. చానెల్–9 నొక్కగానే 'ఒ3'గాలి సన్నగా వీచింది. ఆమె గట్టిగా లోపలికి పీల్చింది. అలసటంతా పోగా ఆమె ఉత్సాహంతో నిండింది. చానెల్ మూసింది. బ్రీఫ్‌కేసులో తాను పొద్దున కొన్న ఉంగరం ఉందో లేదో అని చూసుకుంది. ఈలోగా ఎదుట ఉన్న బజర్ మోగింది. ఆమె కిందకు చూసింది.....అప్పుడే చోటాపాలెం వచ్చేసిందే అనుకుంటూండగా ఆమె శకటం కిందికి దిగసాగింది. దానంతట అదిగా ఖాళీ పార్కింగ్ స్థలంలోకి దిగి ఆగిపోయింది.

విమానం ఎక్కి బొంబాయిలోని తన ఆప్త స్నేహితురాలు రంజన పెళ్ళికి హాజర యింది. ఉంగరం బహూకరించింది. మళ్ళీ ఢిల్లీ చేరేసరికి రాత్రి పదకొండున్నరయింది. ఇల్లు చేరి మంచం మీద వాలేసరికి పన్నెండు దాటింది.

('వెల్ కమ్.....యంగ్ లేడీ...' అంటూ జవహర్లాల్ తనకో చక్కని గులాబీని బహూకరిస్తున్నాడు. ఎంత గొప్ప క్షణం అది.)

అయితే ఆ రొద ఏమిటి....

కల ఎగిరిపోగా... కళ్ళు తెరిచింది పింకీ. విషన్ ఫోన్ ఎర్రదీపం వెలిగి వెలిగి ఆరుతూంది. లేచి కూచుంది పింకీసింగ్.

"ఏ2 జడ్ 15 కాలింగ్ సి.ఏ," అన్న సందేశం పదేపదే వినబడసాగింది. మంచం

కోడుకు ఉన్న బటన్ నొక్కి 'సిపి కాలింగ్' అంది పింకీసింగ్.

"ఎమర్జెన్సీ ఎట్ టీ-ఏం.బి....విబ్‌గ్యార్ జీరో జీరో జీరో" అంది ఆ గొంతు, రిపీట్ మెసేజు ఎ2 జడ్ "5" అంది పింకీ.

పింకీ పై ప్రాణాలు పైకెగిరిపోయినంత పనయింది.

టి.ఎం.బి. – అంటే తీన్ మూర్తి భవన్, విబ్‌గ్యార్ అంటే 'ఏడు రంగుల పాత్ర.' జీరో జీరో జీరో అంటే మాయం అయింది.

మైగాడ్ !

ఎవరు, ఎక్కడ, ఎప్పుడు?

వెయ్యి ప్రశ్నలు.... లక్ష అనుమానాలు....అయిదు నిమిషాలలో పింకీ ఆఫీసుకు దూసుకు వెళ్ళింది. సూర్యుడింకా ఉదయించలేదు.

* * *

ఉదయాకాశం పురిటి నొప్పులు పడుతూంది వెలుగు దొరను కనడం కోసం.

"హలో! ఏమిటి కబుర్లు....?"

"ఎందుకటువైపు వాలిపోయావు, అయ్యో, ఆ వూతం పడిపోయింది.....?"

"ఎంత బాగున్నావో సుమా...."

"ఇఫ్యూ యు డోంట్ మైండ్, ఇక్కడ తుంచేస్తాను....."

"థాంక్యూ! థాంక్యూ....."

మొక్కలు తలలూస్తున్నాయి. మొగ్గలు వికసిస్తున్నాయి. పువ్వులు నవ్వుతున్నాయి. రంగులు కళ్ళకు హాయినిస్తున్నాయి. లేలేత పరిమళాలు రెక్కలు కట్టుకుని గాలిలోకి లేస్తున్నాయి. ఉండండి ఒక తీగ కార్తికేయశర్మ బుగ్గను తాకుతూంది. ఇంకో కొమ్మ....రా నేస్తం రా, అన్నట్లు ఆడుతూంది. 'చూశావా....నువ్వు నాకు పోసిన ప్రేమఫలితంగా, నా విలువంతా కరిగించి ప్రాణం పోసిన నా కృతజ్ఞత ఇదుగో' అంటున్నట్లు సన్నటి మొక్క తను శిరసు మీద ముగ్ధ మనోహరంగా ఒక పువ్వును చూపిస్తూంది.

కార్తికేయకూ ఆ ప్రకృతికీ మధ్య అది అతి సహజమైన బాంధవ్యం. అతడు వాటిని పలకరిస్తాడు. వాటితో పరాచికాలాడుతాడు. మందిస్తాడు లాలిస్తాడు. ఆ మొక్కలు, తీగలు చెట్టు అన్నీ కలిసిన చాలా పెద్ద కుటుంబానికతడు పెద్ద.

21వ శతాబ్దంలో కూడా కొందరు జడులు 'మీ పిచ్చిగాని మొక్కలతో మాటలేమిటండీ? అని అంటే కార్తికేయ – మొక్కలు వూపిరితిత్తులు లేకుండానే ఉచ్ఛ్వాస నిశ్వాసలను నిర్వర్తిస్తున్నాయి. జీర్ణకోశం లేకుండానే నేల నుండి సూర్యరశ్మి నుండి సత్తువను తీసుకుని జీర్ణించుకోగల్గుతున్నాయి. కండరాలు లేకుండానే కదలుతున్నాయి. మరి చెవులు లేకుండా మాటలు వినలేవంటారా? అసలు మన భావాలను మాటలలోకి మార్చడం అన్నది మనుషులమైన మన అసమగ్రతకు నిదర్శనం. భావాలను భావాలుగా గ్రహించగల పద్ధతి ఒకటి ఉంది. అది మొక్కలకు తెలుసు జంతువులకు తెలుసు. సర్వ

ప్రకృతికీ తెలుసు. తన కన్నీ తెలుసుననుకుంటున్న మాటలు నేర్చిన అహంభావ పూరితుడయిన మానవుడొక్కడికే అది తెలియదు.

ఆ నది ఒడ్డున, తోట మధ్య, వెలుగునీడలు శ్రీ చక్రం మధ్య బిందువులా ఉండే ఇంటి ముందు వరండాలోకి అడుగు పెట్టగానే గుమ్మానికి కుడివైపున నిలువెత్తున–జగదీశ చంద్రబోసు తైల వర్ణచిత్రం కన్పిస్తుంటుంది. ఎడమవైపున ఫ్రేము కట్టిన కాన్వాసు మీద బోసుయొక్క ఈ మాటలు రాసి ఉంటాయి.

"అనంతమైన ఈ ప్రకృతి మందిరంలో ఎన్నో భాగాలున్నాయి. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క దారి ఉంది. ఒక్కొక్క ప్రవేశ ద్వారం ఉంది. భౌతిక శాస్త్రజ్ఞుడు ఒక్క ద్వారం చేరుతున్నాడు. రసాయన వేత్త ఇంకో గుమ్మంద్వారా లోపలికి వస్తున్నాడు. జీవశాస్త్రజ్ఞుడు తట్టే తలుపు ఇంకొకటి, ఇట్లా ఎవరికి వారుగా వారివారి భాగాలలోకి అడుగు పెడుతున్నారు. కాని తమ భాగానికీ, ఇతర భాగాలకూ సంబంధం లేదనుకుంటున్నారు. అందువలననే ఖనిజమని, స్థావరమని, జంగమమని ప్రకృతిని విభజించారు. ఆ విభజన అనృతం. ఎవరు ఎక్కడ ఏ జిజ్ఞాసతో అన్వేషణ మొదలుపెట్టినా గమ్యం మాత్రం అవిభాజ్యమూ, స్వయం పరిపూర్ణమూ అయిన జ్ఞానమే అని గుర్తుంచుకోవాలి...."

దాదాపు శతాబ్దం కింద బోసు వేసిన బాట మీద లూథర్ బర్బాంక్, జార్జి వాషింగ్‌టన్, డోకోతీరాటలాక్, క్లీబాక్‌స్టర్‌ల వంటి జిజ్ఞాసువులు నడిచిన అడుగుజాడలలో నడిచే కార్తికేయకు ఎప్పుడో కాని బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు. అది కూడా ఆ ప్రపంచం అతడిని పిలిచినప్పుడే....

ఒకసారి అలాటి పిలుపు వచ్చినపుడు జరిగిన సంఘటన గుర్తుకొచ్చినపుడల్లా అతడు నవ్వుకుంటాడు. నవ్వి తోట వైపు కృతజ్ఞతతో చూస్తాడు.

అతడిని ఆ ఎంబసీ వారంతా ప్రేమతో ఎందుకు పిలిచారో వూహించలేదని కాదు. కాని కళాకారులను మేధావులను, ప్రయోగశీలురయిన విశిష్ట వ్యక్తుల్ని పిలుస్తున్నామన్నారు కదా అని వెళ్ళాడు.

భారతదేశంపట్ల బయటికి మాత్రం ఎంతో ప్రేమాదరాలు ప్రకటించే జుష్వానాకు భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని చూస్తుంటే లోలోపల కొంత ఈర్ష్య, అసహనం ఉంది. కాని అది వ్యక్తం కాకుండా జాగ్రత్త పడుతుంటుంది. ముప్ఫై–ఏళ్ళ కింద అధోగతిలో ఉన్న భారతదేశం నైతిక పునరుద్ధరణతో పుంజుకుంది. వ్యక్తి శీలం ప్రాతిపదికగా ఏర్పడిన కొత్త వ్యవస్థలో ఇంకా లోపాలున్నప్పటికీ, ప్రాక్పశ్చిమాల సమ్మేళనం అనదగిన సమగ్ర జీవన విధానాన్ని ప్రపంచానికి ప్రసాదించిన భారతదేశం – ఈ భూమ్మీద అగ్రగామిగా నిలబడింది. అది చూసి కన్నుకుట్టిన కొన్ని దేశాలలో జుష్వానా ఒకటి. వారి ఎంబసీ పార్టీకే తాను వెళ్ళాడు ఆ రోజు.

అంతమందిలోనూ అతడి రాకను ప్రత్యేకంగా గుర్తించాయి భవనం రెండో అంతస్తు మీద ఆ కళ్ళు.... తెల్ల ధోవతీ, కాషాయ రంగు కుర్తా, భ్రూమధ్యాన కుంకుమ బొట్టు, కుడి మణికట్టుకు పూల దండ, కళ్ళ జోడు – లో అతడు ప్రత్యేకంగానే

ఉన్నాడు. కాని అతడిని రెండో అంతస్తు మీద గూఢచారి చూసింది అందువలన కాదు.

ఆ గూఢచారి లోపలికి తిరిగి "అదిగో వచ్చాడు"

ఎంబసీలో రెండవ కార్యదర్శి కిటికీలో నుంచి చూశాడు. జనంలో కలిసిపోతున్న కార్తికేయను చూసి- "ఎలాగయినా ఇతడిని మన దేశానికి తరలించాలి. ఇతడి విద్య నుపయోగించి మన ఆహార కొరతను తీర్చాలి.... చూపించాలి మన తడాఖా....కబుల్తాన్ చేరిస్తే తెలుస్తుంది..." అని నెమ్మదిగా అంటూ... పక్కనున్న బజర్ నొక్కాడు.

మరు నిముషం...నీలి కళ్ళుగల అపురూప సౌందర్యం ఆడదిగా అతడి ఎదుట నిలిచింది.

"ఫెలోనా....చేప గాలం వైపు వచ్చింది. ఎర నువ్వు. పార్టీ హడావుడిలో చల్లగా అతడిని వేరు చేయి. డాబా మీదికి చేరు...... అక్కడ శకటం రెడీ – గంటన్నరలో కబుల్తాన్ చేరుద్దాం" అన్నాడు కార్యదర్శి.

కబుల్తాన్ వారి దేశ రాజధాని.

"ఎస్సార్...." అంది ఫెలోనా.

....ఇవేమీ ఎరగని కార్తికేయను ఆమె అరగంటలోగా పరిచయం చేసుకుని కబుర్లలోకి దింపి, అతడు ఎడారులలో ధాన్యం పండించడం గురించి చర్చించి..... వెయిటర్‌ని పిలిచి రెండు గ్లాసుల కూల్ డ్రింక్ తెప్పించింది.

పంచేంద్రియాలకన్నా అతీతమయిన గ్రహణ శక్తితో అన్నీ వింటూ, మాట్లాడుతూ, చిరునవ్వుతో ఉన్న కార్తికేయ ఆ డ్రింక్‌లు రాగానే, ఆమె అందిచ్చిన గ్లాసుని కుడిచేత్తో పైకెత్తాడు.

కుడి మణికట్టుకు కట్టిన పూలదండలోని లేత తులసి ఆకు కొన హఠాత్తుగా అతడి దృష్టి నాకర్షించింది. ఆ కొన నల్లగా మాడినట్లనిపించింది. గ్లాసును కింద దాచాడు.

ఫెలోనా నిశ్చేష్టురాలైంది.

"ఒక్క నిముషమండీ.....ఆయన నొక్కసారి పలకరించి వస్తా" నంటూ లేచాడు.

ఎంతో, శిక్షణ పొందిన ఫెలోనా కూడా అతడు ఆ భవనం వదిలి వెళ్ళిన అయిదారు నిముషాల తర్వాతకాని ఆ విషయం తెలుసుకోలేకపోయింది....

...."మళ్ళీ పిలవలేదు ఆ ఎంబసీవారు ఎందుకంటావ్ తులశమ్మా...." అని నవ్వుకుంటుంటాడు కార్తికేయ. అమెరికాలో క్లీబాక్‌స్టర్ నేర నిరూపణకు మొక్కలను వాడిన ప్రయోగాలకు భారతదేశపు వృక్షాయుర్వేద సూత్రాన్ని జతపరిచి, బోసుయొక్క టెక్నిక్ నింకా అభివృద్ధి పరచిన అతడి చేతి మీద దండ ఎన్నెన్ని శక్తులకు తరంగాలకు, ప్రేరణలకు స్పందిస్తుందో....అతడికి తెలుసు. ఆ మొక్కలకు తెలుసు. అందుకే ఆ నవ్వు.

* * *

"సప్తవర్ణ పాత్ర అస్తమయం?"

"తీన్‌మూర్తి భవన్‌లో అంతర్జాతీయ చోరీమురా!"

"ఏడు రంగుల పాత్ర ఎలా పోయినట్లు?" -వంటి పతాక శీర్షికలతో నిలవేస్తున్న దిన పత్రికలు.

వేలిముద్ర నిపుణుల నుండి హోలోగ్రాఫిక్ నిపుణులదాకా సమర్పించిన నివేదికలు.

ఇంటర్ పోల్, ఐరాస ప్రత్యేక భద్రతాదళాల వారి రహస్య సమాచార డోసియర్లు.

మధ్య మేజా మీద ఉండగా, దాని చుట్టూ ప్రధాన మంత్రి, హోంమంత్రిణి, విదేశాంగ మంత్రి, భద్రతా ప్రధానాధికారి, పింకీసింగ్ కూర్చుని ఉన్నారు. ఆరు గంటల సుదీర్ఘ చర్చల అనంతరం కార్తికేయకు కబురు వెళ్ళింది.

అతడు వచ్చాడు.

మరో గంటన్నర తర్వాత పథకం స్థిర మయింది.

-ఆ మరు శుక్రవారం సాయంకాలం రాష్ట్రపతి భవన్ వెనుకనున్న విశాలమైన ఉద్యానవనంలోకి గంధర్వులు, కింపురుషులూ దిగి వద్దామనుకున్నారు. కాని అది వారి లోకం కాదనుకుని ఎవరికంటా పడకుండా వెళ్ళిపోయారు.

భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఏర్పాటయిన ఆనాటి పార్టీకి దేశ, విదేశాల అతిరథ మహారథులు వచ్చారు. పార్టీ కోలాహలంగా సాగుతూంది. హఠాత్తుగా ఒక ప్రకటన నిలబడింది.

"అతిథులందరికీ శుభవార్త! ఆరు రోజుల కింద కనపడకుండా పోయిందనుకున్న అపూర్వమైన ఏడు రంగుల పాత్రను మా అతిథులు ఇవాళ చూసే అవకాశం ఏర్పరచాము. ఉద్యానవనానికి దక్షిణం వైపున గుల్‌మొహర్ చెట్టు కింద మేజా మీద ఆ పాత్రనుంచాము..... దయచేసి చూడదలచిన వారంతా ఒక వరుసగా రమ్మని ప్రార్థన..."

ఆ ప్రకటన అతిథి అర్ణవంలో అలలు లేసింది.

"భేష్...."

"కంగ్రాట్స్, ప్రైమ్ మినిష్టర్!"

"దీస్ ఇండియన్స్ ఆర్ గ్రేట్....."

"పోదాం పదండి చూద్దాం...."

"అసలా రంగుల మిస్టరీ ఏమిటో-"

"అంతకన్నా మిస్టరీ ....అది పోయి మళ్ళీ దొరకడం-"

"గుల్‌మొహర్ చెట్ల పందిరి కింద టేబిల్ మీద గాజు పెట్టెలో ఆ పాత్ర ఎర్రటి గులాబీలా మెరుస్తూంది."

చూడదలిచే వారందరూ క్యూలో వస్తున్నారు. చూస్తున్నారు విస్తుపోతున్నారు.

-ఆ మేజా వెనకాల దట్టమైన పొర వెనుక ఒక తులసి మొక్క పాలిగ్రాఫ్ లై-డిటెక్టర్ ఎలక్ట్రోడ్‌లతో కలిపి ఉంది. డిటెక్టర్ చివర ఉన్న అతి సన్నటి కలంపాళీ ఒక గ్రాఫ్ పేపర్ మీద ఉంది. ఈ యజ్ఞానికి సూటు, బూటూ, హేటు, నల్లటి

కళ్ళద్దాలు వేసుకున్నాయన పౌరోహిత్యం వహిస్తున్నాడు. ఆయనగాని, ఆ ఏర్పాటుగాని ఎవరికీ కనపడని పద్ధతిలో ఉంది.

జనం ఒక్కొక్కరే దగ్గరయినకొద్దీ....పాళీ తిన్నగా గీరలు గీస్తూంది.... ఒక్కొక్కసారి కొద్దిగా పై కెగసి పడుతూంది. కళ్ళజోడాయన దృష్టి అర్రక్షణం కూడా ఆ పాళీ కదలికను వదలడం లేదు.

ముప్పావు గంటయింది. దాదాపు వందా పాతిక మంది చూసి వెళ్ళారు.

ఉన్నట్లుండి పాళీ ఎవరో తోసినట్లు – బలవంతాన తోసినట్లయి పైకి లేచింది. విపరీతమైన కంపనంతో పైకి కిందికి, పైకి కిందికి ఎగసెగసి పడసాగింది.

కళ్ళ జోడాయన కళ్ళ జోడు తీశాడు. మేజా అవతల ఉన్న వ్యక్తిని చూసాడు.

నీలి రంగు పూల ప్రింటున్న బుష్‌షర్ట్‌లో బంగారు రంగు జుత్తులో ఉన్నాడా మధ్య వయస్కుడు.

కళ్ళ జోడాయన తన దగ్గర కిందపడుకున్న బెరెట్ టోపీ చెవిలో వూదాడు.

నీలి రంగు బుష్‌షర్ట్ నడవలేక నడవలేక ముందుకు నడిచాడు. పది గజాలు దాటకముందే బెరెట్ టోపీ అతడిని సమీపించింది.

"ఒన్ మినిట్ ప్లీజ్.... ఒసారి మీ లైటర్‌నిస్తారా?" నీలి రంగు షర్టతను ఇచ్చాడు. బెరెట్ టోపీ వ్యక్తి అది అందుకుంటూ కింద తూలిపడ్డాడు. 'అరెరె......' అంటూ నీలి రంగు షర్టతను అతడి మీదికి వంగాడు. ఎండిన అతడి మొహానికొక వాసన తగిలింది. మరుక్షణం ఆయన స్పృహను కోల్పోయాడు. బెరెట్ లేచాడు. మరో ఇద్దరి సాయంతో అతడిని అంబులెన్స్‌లోకి, తీసుకువెళ్ళారు.

రాత్రి పదింటికి ప్రధానికి ఫోన్ వచ్చింది. –"ఎస్ సార్, దొరికింది..... అవున్సార్, ఆ నీలి రంగు షర్టు వ్యక్తి బెరిలా నుండి వచ్చిన సాంకేతిక బృందంలో సభ్యుడండీ..... ఈ వారం రోజుల నుండి ఆ పాత్ర వాళ్ళ డిప్లొమాటిక్ మిషన్ శకటం ఢిక్కీలోనే ఉందండి. సాయంకాలం రాష్ట్రపతి భవన్ వాకిట్లో శకటం ఉందండి–" అని వివరించాడా భద్రతాధికారి. ఆ బృందంవారినెలా అదుపులోకి తీసుకోవాలో వివరించాడు. డూప్లికేట్ పాత్ర ఇంకా రాష్ట్రపతిభవన్‌లోనే ఉందనీ చెప్పాడు.

సూటూ, బూటూ, హేటూ, కళ్ళజోడు తీసేసి మామూలు ధోవతి, కుర్తాలోకి మారాడు కార్తికేయ. హాయిగ వెన్నెల్లో పందిరి పక్కన కూర్చున్నాడు.

హఠాత్తుగా హారన్ మోగింది.

ఇంకా ఏమిటీ న్యూసెన్స్ అనుకుంటూండగానే..... 'దేశం తరపున నా కృతజ్ఞతలు అందుకోండి కార్తికేయ గారూ' అంటూ ప్రధాని వచ్చారు.

సంభ్రమంతో లేచి నిలిచాడతను.

లేచి నిలబడుతూ– "సారీ!" అని కార్తికేయ క్షమాపణ చెప్పింది తన చేతి విసురు తగిలిన డ్రాసిరా మొక్కతో!

(ఆంధ్రప్రభ వారపత్రిక, ఏప్రిల్ '83)